లక్ష్మీనరసింహస్వామి జయంత్యుత్సవాలకు శ్రీకారం

తిరువేంకటపతిగా మాఢవీధుల్లో ఊరేగుతున్న స్వామివారు

యాదగిరిగుట్ట, మే 9 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి స్వయంభూ ప్రధానాలయం, అనుబంధ దేవాలయం పూర్వగిరి (పాతగుట్ట) లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నృసింహస్వామి జయంత్యుత్సవాలను అర్చకులు శుక్రవారం ప్రారంభించారు. ఉదయం ప్రధానాలయాన్ని తెరిచిన అర్చకులు స్వామివారికి అభిషేకం, అర్చనలు నిర్వహించారు. ఉదయం 8:45 గంటలకు ఆలయ మండపంలో స్వస్తీవాచనం, విశ్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, రుత్విక్ వరణం, కుంకుమార్చన, రక్షాబంధనం వంటి కైంకర్యాలను చేపట్టారు. అనంతరం స్వామివారికి లక్ష కుంకుమార్చన గావించారు. 11 గంటలకు తిరు వేంకటపతి అలంకార సేవలో స్వామి వారిని ఆలయంలో ఊరేగించారు. సాయంత్రం 6గంటలకు మృత్సంగ్రహణం, అంకురార్పణ, హవనం వంటి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపారు. అనంతరం గరుడ వాహనంపై పరమవాసుదేవ అలంకార సేవను ప్రధానాలయ మాఢవీధుల్లో ఊరేగించారు. పూజా కైంకర్యాలలో ఆలయ ఈఓ వెంకట్రావ్, అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, డీఈఓ, ఏఈఓలు దోర్బల భాస్కర్ శర్మ, ఆలయ ప్రధానార్చకులు నల్లన్‌థీఘశ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వేంకటాచార్యులు, రమేశ్‌బాబు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా జరిగాయి.

ఆలయంలో నేడు..

నరసింహస్వామి జయంత్యుత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 8:45 గంటలకు నిత్యమూలమంత్ర హవనాలు, లక్ష పుష్పార్చన, కాళీయ మర్ధన అలంకార సేవ నిర్వహిస్తారు. సాయంత్రం 6గంటలకు నృసింహ మూలమంత్ర హవనం చేపట్టి, హనుమంత వాహనంపై శ్రీరామావతారం అలంకార సేవ చేపట్టనున్నారు.

రామలింగేశ్వరస్వామి ఆలయంలో చండీ హవనం

చండీ హవనం నిర్వహిస్తున్న ఆలయ ప్రధాన పురోహితులు, ప్రధానార్చకులు

యాదగిరిగుట్ట, మే 9 : పాకిస్తాన్‌లో జరుగుతున్న యుద్ధంలో భారతదేశానికి విజయం సంకల్పించాలని, 'ఆపరేషన్ సింధూర్'లో పాల్గొన్న భారత త్రివిధ దళాలకు సంఘీభావంగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అర్చకులు, పురోహితులు శుక్రవారం పూజలు జరిపారు. గురువారం స్వామివారి జయంత్యుత్సవాలకు శ్రీకారం చుట్టిన నేపథ్యంలో జవాన్ల క్షేమం కోరుతూ సంకల్పం గావించారు. అనుబంధ రామలింగేశ్వరస్వామి ఆలయంలో చండీ హవనం నిర్వహించారు. హవనంలో ప్రత్యేకంగా సంకల్ప హవనం చేపట్టారు. ఆలయ ఈఓ ఎస్.వెంకటరావు, అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, డీఈఓ దోర్బల భాస్కర్‌శర్మ, ఆలయ ప్రధాన పురోహితుడు గౌరిభట్ల సత్యనారాయణ శర్మ, శివాలయ ప్రధానార్చకుడు గౌరిభట్ల నరసింహరాములు శర్మ, ఏఈఓలు గజవెల్లి రఘు, నవీన్ పాల్గొన్నారు.

20న న్యాయ విజ్ఞాన సదస్సు

కార్మిక శాఖ జిల్లా సహాయ అధికారికి లేఖ అందజేస్తున్న జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి వి.మాధవీలత

భువనగిరి అర్బన్, మే 9 : భువనగిరి కోర్టు ఆవరణలో ఈ నెల 20న అసంఘటిత రంగ కార్మికులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి వి.మాధవీలత అన్నారు. న్యాయ విజ్ఞాన సదస్సు, వైద్య శిబిరం నిర్వహించుటకు తగు చర్యలు తీసుకోవాలని సహాయ కార్మిక శాఖ అధికారి సయ్యద్ మొహినుద్దీన్‌కు శుక్రవారం కోర్టు ఆవరణలో లేఖను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికులకు కార్మిక చట్టాల హక్కులు, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల పథకాల లబ్ధి తదితర అంశాలపై అవగాహన పెంపొందించడానికి ఈ సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్మికులు కార్మిక గుర్తింపు కార్డులు తీసుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల్లో లబ్ధి పొందాలని సూచించారు. న్యాయ విజ్ఞాన సదస్సుకు కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో అనర్హులను ఏరివేస్తాం : ఆర్డీఓ

ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను విచారిస్తున్న ఆర్డీఓ కృష్ణారెడ్డి

మోత్కూరు, మే 9 : రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసే ఇందిరమ్మ ఇండ్లను అనర్హులకు వర్తింపజేస్తే ఏరిపారేస్తామని ఆర్డీఓ కృష్ణారెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో 160 మంది లబ్ధిదారులకు ఇండ్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం జాబితా విడుదల చేసింది. కాగా, ఒకే కుటుంబంలో డబుల్ పేర్లు నమోదు కావడం, వయస్సు పైబడిన వృద్ధుల పేరున ఇండ్లు మంజూరైన 29మంది లబ్ధిదారుల కుటుంబాలను కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం ఆర్డీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇండ్లు మంజూరైన అనర్హులను ఏరిపారేస్తామన్నారు. జాబితాలో ఎవరైనా అనర్హులు ఉన్నట్లు తమ పరిశీలనలో తేలితే తొలగిస్తామని చెప్పారు. అనర్హులకు వర్తిస్తే తమకు ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో పర్యవేక్షకురాలు కీర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి : తాసీల్దార్

వెల్దేవిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తాసీల్దార్ శేషగిరిరావు

అడ్డగూడూరు, మే 9 : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని తాసీల్దార్ శేషగిరిరావు అన్నారు. మండలంలోని మానాయికుంట, డి.రేపాక, వెల్దేవి, కంచనపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. లారీలు ఎలా వస్తున్నాయని రైతులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోళ్లను త్వరగా పూర్తి చేయాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని సాయి శ్రీనివాస రైస్ మిల్లును పరిశీలించారు. ధాన్యాన్ని త్వరగా దిగుమతి చేసుకోవాలని మిల్లు యాజమాన్యానికి సూచించారు. ఆయన వెంట ఆర్ఐ ఉపేందర్ ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

నాంచారిపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తాసీల్దార్ నాగదివ్య

మోటకొండూర్, మే 9 : మండలంలోని నాంచారిపేట, కాటేపల్లి, కదిరేణిగూడెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తాసీల్దార్ నాగదివ్య శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల్లో రికార్డులను, ధాన్యం నిల్వ వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు అమ్మినా, కొన్నా చర్యలు తీసుకుంటాం

- కలెక్టర్ హనుమంతరావు

ఆత్మకూరు (ఎం) కూరెళ్ల రైతు సదస్సులో భూ రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

ఆత్మకూరు (ఎం), మే 9 : గతంలో ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసిన అసైన్డ్ భూములను అమ్మినా, కొనుగోలు చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మండలంలోని కూరెళ్ల, కప్రాయిపల్లి గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఆయన పాల్గొని రైతుల దరఖాస్తులను, భూ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం భూ భారతి చట్టం అమలులో భాగంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందన్నారు. రైతులందరూ తమ భూములను, పట్టా పాస్ పుస్తకాల్లో సరి చేసుకోవడంతోపాటు తప్పుగా ఉన్న సర్వే నెంబర్లను సరి చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని గ్రామస్తులు కోరగా.. అర్హులైన పేదలందరికీ విడుతల వారీగా ఇండ్లు మంజూరు చేస్తామని కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో ఆత్మకూరు (ఎం), వలిగొండ మండలాల తాసీల్దార్లు లావణ్య, శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ తాసీల్దార్ సఫియొద్దీన్, ఆర్ఐలు మల్లికార్జున్‌రావు, పాండు, సర్వేయర్ స్వప్న, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ సీఈఓ సస్పెండ్

భూదాన్ పోచంపల్లి : జూలూరు పీఏసీఎస్ సీఈఓ రేబాస్ నర్సింహను సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ హనుమంతరావు ఉత్తర్వులు వెలువరించారు. మండలంలోని అలీనగర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. అలీనగర్ సెంటర్‌ను సీఈఓ ఇప్పటివరకు వచ్చి చూడలేదని, కొనుగోలు కేంద్రంలో హమాలీలను ఏర్పాటు చేయలేదని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సీఈఓను సస్పెన్షన్ చేశారు. అన్ని కేంద్రాల్లో సరిపడా హమాలీలను ఏర్పాటు చేయాలని డీసీఓను ఆదేశించారు.

ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలి : అఖిలపక్షం నాయకులు

రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు

చౌటుప్పల్, మే 9 : ఛత్తీస్‌ఘడ్‌లో కేంద్ర ప్రభుత్వం కొనసాగిస్తున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేవారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం ఆయా పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు, సామాజిక వేత్తలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని, తక్షణమే కర్రె గుట్ట నుంచి పారా మిలటరీ బలగాలను ఉపసహరించుకోవాలని తీర్మానించారు. శాంతిని నెలకొల్పేందుకు కాల్పుల విరమణ ప్రకటించాలని, కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరుపాలని తీర్మానం చేశారు. అంతకు ముందు పలువురు మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఆదివాసుల కాళ్ల కింద ఉన్న ఖనిజ సంపదను మాయం చేసి కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పాలని చూస్తుందన్నారు. దేశ సరిహద్దులో ఉండాల్సిన బలగాలను కర్రె గుట్టలో దింపి గిరిజనులను హత్య చేస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు శ్రీనివాస్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బూర్గు కృష్ణారెడ్డి, ఐద్వా రాష్ట్ర నాయకురాలు బట్టుపల్లి అనూరాధ, ప్రజా సంఘాల నాయకులు కావలి యాదయ్య, మోహన్‌నాయక్, కట్టెల లింగస్వామి, ఎండీ పాషా, పిల్లి శంకర్, జి.సైదులు, పల్లె మధు పాల్గొన్నారు.

భాస్కర్‌రెడ్డికి మాజీ ఎమ్మెల్యే సునీత పరామర్శ

భాస్కర్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సునీత

రాజాపేట, మే 9 : మండలంలోని బసంతాపురం గ్రామానికి చెందిన కోమటిరెడ్డి యువసేన అధ్యక్షుడు మెండు భాస్కర్‌రెడ్డి భార్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు సామల రమేశ్, బొంగోని ఉప్పలయ్యగౌడ్ ఉన్నారు.

'ఆపరేషన్ సింధూర్'కు మద్దతుగా ర్యాలీ

యాదగిరిగుట్ట, మే 9 : 'ఆపరేషన్ సింధూర్'లో భాగంగా పాకిస్తాన్ ముష్కరులతో వీరోచితంగా పోరాడుతున్న భారత జవాన్లకు మద్దతుగా బీజేపీ ఆధ్వర్యంలో పట్టణంలోని స్వామివారి వైకుంఠ ద్వారం వద్దకు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్ మాట్లాడుతూ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సాగుతున్న 'ఆపరేషన్ సింధూర్'ను ప్రతి ఒక్కరూ బలపర్చాలన్నారు. భారత త్రివిధ దళాలకు ప్రజలంతా దన్నుగా నిలువాలని పిలుపునిచ్చారు.

యాదగిరిగుట్టలో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ శ్రేణులు

స్తంభం విరిగి మీద పడి యువకుడి మృతి

మోత్కూరు, మే 9 : మండలంలోని పొడిచేడు గ్రామంలో ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభం విరిగి పడి యువకుడు మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ జిట్ట వెంకటేశ్ (28) గురువారం రాత్రి తన చెల్కలో పత్తి కట్టెను ట్రాక్టర్‌తో తొలగిస్తున్నాడు. ఈ క్రమంలో గెట్టు మీద ఉన్న విద్యుత్ స్తంభానికి బిగించిన సపోర్టు వైరు తగలడంతో స్తంభం విరిగి వెంకటేశ్‌పై పడింది. దాంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.నాగరాజు తెలిపారు.

వ్యవసాయ మోటార్ల విద్యుత్ వైర్లు చోరీ

చౌటుప్పల్ రూరల్, మే 9 : మండలంలోని ఎస్.లింగోటం గ్రామ పరిధిలో గురువారం రాత్రి వ్యవసాయ బావుల వద్ద మోటారు వైర్లను దుండగులు అపహరించుకుపోయారు. గ్రామంలోని సుమారు 30 వ్యవసాయ బావుల వద్ద మోటారు వైర్లు చోరీకి గురైనట్లు బాధిత రైతులు తెలిపారు. ఇలాంటి చోరీలు పలుమార్లు గ్రామాల్లో జరిగాయని, నిందితులు పట్టుబడక పోవడంతో వరుస చోరీలు జరుగుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు. పోలీసులు దొంగలను పట్టుకొని చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు.

హరితహారం మొక్కల తొలగింపు

మోత్కూరు, మే 9 : మున్సిపాలిటీ పరిధిలో మోత్కూరు – గుండాల రోడ్డుకు ఇరువైపులా నాటిన హరితహారం మొక్కలను గుర్తు తెలియని వ్యక్తులు జేసీబీతో తొలగించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హరితహారంలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా నాటించిన మొక్కలను జేసీబీతో తొలగించినట్లు శుక్రవారం ఉదయం మార్నింగ్ వాక్‌కు వెళ్లిన వాకర్స్ గుర్తించారు. దుండగులు గురువారం రాత్రి ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారని, వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

- 43 ఏండ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు

గుండాల, మే 9 : 43 ఏండ్ల సుదీర్ఘ కాలం తర్వాత పదో తరగతి బ్యాచ్ స్నేహితులు ఒక్కచోటుకు చేరి ఆనందోత్సాహాల మధ్య ఆత్మీయ సమ్మేళనం జరుపుకొన్నారు. మండలంలోని సీతారాంపురం ఉన్నత పాఠశాలలో 1981-82 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఆత్మీయంగా పలుకరించుకొని అలనాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం గురువులకు సన్మానం చేశారు. కార్యక్రమానికి హాజరైన ప్రభుత్వ న్యాయవాది ఎంఏ రహీం మాట్లాడుతూ స్నేహానికి మించిన బంధుత్వం ఏమీ ఉండదన్నారు.

వికృత అందాల పోటీలు నిర్వహించొద్దు : ఐద్వా

సంఘం సభ్యత్వాలను అందిస్తున్న ఐద్వా జిల్లా కార్యదర్శి అనూరాధ

చౌటుప్పల్, మే 9 : విశ్వ వీధిలో అతివలను వివస్త్రగా నిలబెట్టే వికృత క్రీడ అందాల పోటీలను తెలంగాణలో నిర్వహించొద్దని ఐద్వా జిల్లా కార్యదర్శి బట్టుపల్లి అనూరాధ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని 16వ వార్డులో శుక్రవారం సంఘం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రం అప్పుల ఊబిలో మగ్గుతుంటే అందాల పోటీలు ఎందుకని ప్రశ్నించారు. స్త్రీ ఆత్మ గౌరవాన్ని భంగపరిచే ఈ అందాల పోటీలను ప్రతిఘటిద్దామని మహిళలకు పిలుపునిచ్చారు. ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేని ఈ పోటీలను బడా పెట్టుబడిదారుల కోసమే పెడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు అవ్వారు రామేశ్వరి, బత్తుల జయమ్మ, చింతల రజిత, యాదమ్మ, సంధ్య, దేవేంద్రమ్మ, పుష్ప, వీణ, ఇందిర పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి : సీఐటీయూ

సమ్మె పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 9 : ఈ నెల 20న చేపట్టే దేశవ్యాప్త సమ్మెలో సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ కేంద్ర కమిటీ సభ్యుడు కల్లూరి మల్లేశం పిలుపునిచ్చారు. పట్టణంలో శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్మిక హక్కులను కాలరాసి పని గంటలను పెంచే నాలుగు లేబర్ కోడ్‌లను, డ్రైవర్లను కఠినంగా శిక్షించాలనే ఉద్దేశంతో తెచ్చిన హిట్ అండ్ రన్‌ను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రవాణా రంగ కార్మికులను ఆదుకోవాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, నూతన మోటార్ వాహన చట్టాన్ని సవరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ మంచాల మధు, ట్రాన్స్‌పోర్టు యూనియన్ నాయకులు మల్లారెడ్డి, చెక్క స్వామి, శ్రవణ్, రజినీకాంత్, స్వామి, పాండు, మహేశ్, సాయి పాల్గొన్నారు.

సమ్మర్ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

భువనగిరి అర్బన్, మే 9 : సమ్మర్ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ మాజీ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని కాలేజీ గ్రౌండ్‌లో ఫ్రీ సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంపును ఉమ్మడి నల్లగొండ జిల్లా కార్యదర్శి అమీన్ బాబాతో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆంజనేయులు మాట్లాడుతూ క్రీడలతో ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. అమీన్ బాబా మాట్లాడుతూ మొదటి రోజు ఉచిత సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంపునకు 150 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 12న దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు బలరాం, క్రికెట్ కోచింగ్ ఇన్‌చార్జి రావుల సతీశ్, కేతాన్ పాల్గొన్నారు.

'ఉపాధి హామీ కూలీలకు సమ్మర్ అలవెన్స్ పునరుద్ధరించాలి'

వలిగొండ, మే 9 : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు సమ్మర్ అలవెన్స్ పునరుద్ధరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సిర్పంగి స్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని గుర్నాథపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనిచేస్తున్న ప్రదేశాన్ని శుక్రవారం సందర్శించి కూలీలతో మాట్లాడారు. కూలీలకు సమ్మర్ అలవెన్స్ పునరుద్ధరించాలని, పనిచేసే చోట కూలీలకు అన్ని వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టం రక్షణకు ఈ నెల 20న దేశవ్యాప్తంగా నిర్వహించే సమ్మెలో ఉపాధి హామీ కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాస్కర్, అమరేందర్, పాపయ్య, యాదయ్య, స్వామి, శ్రీశైలం, నవీన్ పాల్గొన్నారు.

నర్సాపురంలో ధాన్యం చోరీ

రాజాపేట, మే 9 : మండలంలోని నర్సాపురం ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉంచిన ధాన్యం చోరీ అయ్యింది. రాజాపేటకు చెందిన నమిలె శ్రీహరి ధాన్యం విక్రయించేందుకు కొనుగోలు కేంద్రంలో పోశాడు. గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఏడు క్వింటాళ్ల ధాన్యాన్ని దొంగిలించారని బాధిత రైతు తెలిపాడు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

కస్తూర్బా గాంధీ జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్, మే 9 : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. పట్టణంలో రూ.3.25కోట్లతో చేపటే కస్తూర్బాగాంధీ జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతతో భవన నిర్మాణ పనులు చేపట్టాలని కాంట్రాక్టర్లకు సూచించారు. పాఠశాల స్థలాన్ని సర్వే చేసి కబ్జాలను తొలగించాలని తాసీల్దార్‌ను ఆదేశించారు. అంతకుముందు మున్సిపాలిటీ పరిధిలోని లక్కారంలో కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. మండలంలోని దామెర గ్రామంలో రూ.23కోట్లతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, నాయకులు పాల్గొన్నారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం

సంస్థాన్ నారాయణపురం : మండల కేంద్రంలో రూ.25 లక్షలతో నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను, రూ.6.45 లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు శ్రీను నాయక్, నాయకులు ఉమాదేవి, నర్సింహ, సతీశ్, బాలకృష్ణ, లింగస్వామి, అక్బర్ అలీ, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

పేదింటి మహిళలకు కల్యాణలక్ష్మి వరం

- ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

వలిగొండ, మే 9 : పేదింటి మహిళలకు కల్యాణలక్ష్మి పథకం ఒక వరమని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం 67మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం మండలంలోని వెల్వర్తి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. దిగుమతిలో రైతులను ఇబ్బంది పెట్టే మిల్లులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్యా భీమానాయక్, డిప్యూటీ తాసీల్దార్ పల్లవి పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

మహిళా చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సార్ప్ సంస్థ అధ్యక్షురాలు ప్రమీల

భువనగిరి అర్బన్, మే 9 : మహిళా చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సార్ప్ సంస్థ అధ్యక్షురాలు ప్రమీల అన్నారు. సార్ప్ సంస్థ ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై శుక్రవారం మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు పనిచేసే ప్రదేశంలో లైంగిక వేధింపులకు గురైతే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. అందుకు చట్టాలను వినియోగించుకోవాలని సూచించారు. 18సంవత్సరాల్లోపు ఆడపిల్లలపై దాడులు జరిగితే పోక్సో చట్టం ఉంటుందని, ఈ చట్టంపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్స్, సార్ప్ సంస్థ సిబ్బంది సరిత, రాజేశ్, కవిత, కృష్ణవేణి, శోభ, గ్రామ స్థాయి వలంటీర్లు పాల్గొన్నారు.

బడీడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి